క్లుప్తంగా

కారుణ్య నియామకం



కారుణ్య నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ప్రమాదవశాత్తు ఈ ఏడాది ఆగస్టులో మరణించిన హోంగార్డు టి.కాంతారావు కుమారుడికి కారుణ్య నియామకం ప్రకారం హోంగార్డుగా నియమించి నియామక పత్రాన్ని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సోమవారం అందజేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయానికి కాంతారావు సతీమణి లక్ష్మి, కుమారుడు సత్యనారాయణను ఎస్పీ పిలిపించారు. రాష్ట్ర చీఫ్ ఆఫీస్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన రూ.40 వేలు సైతం లక్ష్మికి అందజేశారు.

ఎస్పీని కలిసిన అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని ఏపీఎస్పీ బెటాలియన్ (ఎచ్చెర్ల) అసిస్టెంట్ కమాండెంట్ ఎం.గోపాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. రెండో పట్టణ సీఐగా ఆదివారం విధుల్లో చేరిన పి.ఈశ్వరరావు సైతం ఎస్పీని కలిశారు. పట్టణ పరిధిలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

జాబ్‌మేళాలో 185 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 185 మంది నిరుద్యోగ అభ్యర్థులు ఎంపికయ్యారు. కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో 4 ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఈ జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుంచి 231 మంది హాజరయ్యారు. అంతకుముందు ఈ జాబ్‌మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, జేకేసీ కో–ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, బి.నవీన్ పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వారధి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో ఐ.వి.రమణ, తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లు పూర్తి చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: కాలనీల్లో అసంపూర్తి ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ ఎ.అప్పారావు అన్నారు. ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్‌పురం పరిధిలో నిర్మించిన కాలనీలు సోమవారం పరిశీలించారు. ఎచ్చెర్ల మండలంలో 415 ఇళ్లు 100 రోజుల్లో పూర్తిచేసే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఎం.రమేష్, వర్కు ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ క్రీడాకారుల జాబితా వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల జాబితా ఖరారైంది. గుంటూరులో ఈనెల 6 నుంచి 9 వరకు నాలుగు రోజులపాటు ఆలిండియా సివిల్ సర్వీసెస్(ఆఫీసు సబార్డినేట్ నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు) ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఉద్యోగ క్రీడాకారులకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 29వ తేదీన కోడి రామ్మూర్తి స్టేడియం వేదికగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు ఎంపికచేశారు. మొత్తం మీద జిల్లా నుంచి 16 క్రీడాంశాల్లో 136 మంది ఉద్యోగులతో కూడిన జాబితాను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెల్లడించారు. ఎంపికైన ఉద్యోగ క్రీడాకారులు 6వ తేదీన గుంటూరు క్రీడామైదానంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94409 63128 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గౌరవ వేతనాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదలైనట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ, 23 మంది ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యుల ఆరు నెలల వేతనం విడుదలైందన్నారు. గౌరవ సభ్యులకు త్వరలో అందజేస్తామని తెలియజేశారు.

పక్కాగా నైపుణ్య సర్వే

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామం యూనిట్‌గా పక్కాగా యువత సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యు.సాయికుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో నైపుణ్య గణనపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి శ్రావణి, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్ పాల్గొన్నారు.

కరువు కోరలు.. రైతు దిగాలు..!



కుశాలపురం పరిధిలో ఎండిన పంటలు

- వెంటాడిన వర్షాభావ పరిస్థితులు
- నారాయణపురం నుంచి అందని సాగునీరు
- దాదాపు 5 వేల ఎకరాల్లో పంటనష్టం

ఎచ్చెర్ల క్యాంపస్: గత 20 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఎచ్చెర్ల మండలం కరువు కోరల్లో చిక్కుకుంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు వెంటాడగా.. మరోవైపు నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీరు అందించలేక ప్రభుత్వం చేతులు ఎత్తేసింది. దీంతో వెదలు, నాట్లుకోసం వేలల్లో ఖర్చు చేసిన రైతులు దిగాలుగా ఉన్నారు. ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడి కాలువ కింద 7,175 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. కాగా సుమారు ఐదు వేల ఎకరాల్లో వరిసాగుకు ఈ ఏడాది నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. కుశాలపురం, తోటపాలేం, కొత్తపేట, పొన్నాడ, ముద్దాడ, ధర్మవరం, భగీరథపురం, ఓలేటి అగ్రహారం, కొంగరాం, బొంతలకోడూరు తదితర గ్రామాల్లో రైతులు పంటలను దాదాపు కోల్పోయారు. దీంతోపాటు మరోపక్క పశుగ్రాసం కొరత వెంటాడుతోంది. అందువలన రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కావున ఎచ్చెర్ల మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలని రైతులు కోరుతున్నారు.



నారాయణపురం కుడి కాలువ పరిస్థితి

ఆర్థిక సాయంపై ఆశలు

ప్రభుత్వం పంటనష్టంపై అధ్యయనం చేయడం, నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం, ఇతర రాయితీలు అందజేయడం, రాయతీపై పశుగ్రాసం అందజేయడం వంటి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పంటలు కోల్పోవడం తీవ్రనష్టంగా వీరు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేయలేమని వాపోతున్నారు.

సమగ్ర సర్వే నిర్వహించాలి



ఎచ్చెర్ల మండలంలోని నారాయణపురం కుడి కాలువ కింద రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేలల్లో పెట్టిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. ప్రభుత్వం స్పందించి సమగ్రంగా గ్రామం యూనిట్‌గా సర్వే నిర్వహించాలి. పంట కోల్పోయిన విస్తీర్ణం ఆధారంగా నష్ట పరిహారం అందజేయాలి. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

– సనపల నారాయణరావు, మాజీ జెడ్పీ విప్, ఎచ్చెర్ల

ప్రభుత్వం స్పందించాలి



పంట నష్టంపై ప్రభుత్వం స్పందించాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి జిల్లా కలక్టరేట్ ఫిర్యాదు విభాగంలో సాగునీటి కోసం వినతులు అందజేశాం. అయినా స్పందించ లేదు. చివరకు రైతులు పంటలు కోల్పోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. నష్ట పరిహారం అందజేయడం, రాయతీపై ఎండుగడ్డి సరఫరా వంటి చర్యలు తీసుకోవాలి.

– అల్లు సూర్యనారాయణ, రామజోగిపేట, రైతు

అధికారుల దృష్టికి సమస్య

ఉన్నతాధికారుల దృష్టికి స్థానికంగా ఉన్న సమస్య తీసుకెళ్తాం. గ్రామాల రైతులు నుంచి వచ్చిన ఫిర్యాదులపై సమాచారం ఇస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– సింహాచలం, తహసీల్దార్, ఎచ్చెర్ల

పేరుకుపోయిన చెత్త



నగరంలోని పాలకొండ రోడ్డులో విచ్చలవిడిగా చెత్త పేరుకుపోయింది. దీంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించకపోవడంతో జ్వరాలబారిన పడుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త వద్ద కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ భయపెడుతున్నాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్, శ్రీకాకుళం

బారికేడ్లు ఏర్పాటు చేయరూ..



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని రాగోలు ఆర్టీసీ కాలనీ దాటాక వే బ్రిడ్జికు రెండు వైపులా ఉండాల్సిన దిమ్మలులో ఒకటి పూర్తిగా నేలమట్టం అయ్యింది. దీంతో శ్రీకాకుళం నుంచి ఆమదాలవలసకు రాకపోకలు చేసినపుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పొరపాటున ఆదమరిచి ప్రయాణిస్తే ఘోర ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అందువలన అధికారులు స్పందించి వెంటనే వే బ్రిడ్జికు బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

మంచుకురిసే వేళ



లావేరు మండలంలో సోమవారం ఉదయం మంచు దట్టంగా కురిసింది. దీంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ప్రకృతి ప్రేమికులు వాతావరణాన్ని ఆస్వాదించారు. అయితే దట్టమైన మంచు వలన రహదారి కనిపించక పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– ఎచ్చెర్ల

గత ప్రభుత్వంలో విద్యార్థులు రోడ్డెక్కలేదు

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



ఎస్ఎఫ్ఐ ధర్నాకి సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గత ప్రభుత్వంలో విద్యార్థులు రోడ్లు ఎక్కాల్సినటువంటి పరిస్థితి ఉండేది కాదని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వారికి అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నగరంలో విద్యార్థులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు పెద్ద ఎత్తున మీకోసం నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మీ కోసం కార్యక్రమానికి వచ్చిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల చెల్లింపులు ప్రభుత్వం చేయకపోవడం విచారకమన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్నటువంటి విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలల్లో ఫీజులు కట్టకపోతే పరీక్ష ఫీజులు కట్టించుకోబోమని యాజమాన్యాలు విద్యార్థుల్ని బెదిరిస్తూ ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులకు స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు పోరాటం ఆపమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం సంతోష్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ పి పవిత్ర, నాయకులు నగేష్ చెన్నారావు సింహాద్రి జీవిత డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు

- కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన మాజీమంత్రి సీదిరి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి సమస్య వివరిస్తున్న మాజీ మంత్రి సీదిరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని మాజీమంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ తరుపున ఎన్నికైన ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధుల పేర్లను వివిధ పనులకు సంబంధించిన శిలాఫలకాల్లో లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన శిలా ఫలకాలను కూల్చివేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం అపహాస్యం చేస్తోందన్నారు. ఈ మేరకు ప్రోటోకాల్ ఉల్లంఘనలపై వివిధ అంశాలను రుజువులతో కలెక్టర్‌కి సమర్పించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పౌర సంఘాలు, పాత్రికేయులపై భౌతికదాడులకు పాల్పడుతున్నారని, దీనిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషనుకి వెళ్లి ఫిర్యాదు చేస్తే అక్కడ కూడా రక్షణ కరువైయిందని దుయ్యబట్టారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పౌర సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

మెటీరీయల్ కాంపోనెంట్ పనులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులను వెండర్స్‌కు కేటాయించే విధానాన్ని రద్దు చేస్తూ, సర్పంచ్‌లకు విధులు, నిధులు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయి కుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం సోమవారం అందజేశారు. కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో సర్పంచ్‌ల అధికారాలను తగ్గిస్తూ, ఉపాధి హామీ పథకం మెటీరీయల్ కాంపోనెంట్ పనులను వెండర్స్‌కు కేటాయించడం తగదన్నారు. ఆయనతో పాటు రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రెడ్డి విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మీసాల రామారావు, పతివాడ సత్యం, కలిశెట్టి కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

అపరాలతో రైతులకు లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త చిట్టిబాబు

జి.సిగడాం: రైతులు అపరాలు సాగు చేసుకుంటే లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త చిట్టిబాబు, రణస్థలం ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద అన్నారు. మండలంలోని పాలఖండ్యాం, సంతవురిటి గ్రామాల సమీపంలో రైతులకు అపరాల పంట సాగుపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి పంట పొలాల్లో మొక్కజొన్న పంటల కాకుండా అపరాలు(మినుము, పెసర) పంటలు వేసుకోవాలన్నారు. రబీలో అన్ని పంటల కంటే అపరాలు సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో విఫలం

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో మండలానికి మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు అందించడంలో అధికారులు విఫలమయ్యారని, ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, చిత్తిరి మోహన్, తిరుమలరెడ్డి వెంకటరావు, బోగాది అప్పలనాయుడు, ధారబోయిన రెయ్యమ్మ నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. మండలంలో పూర్తైన పలు నిర్మాణాలకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఎరువుల దుకాణాల్లో యూరియా బస్తా రూ.350లకు విక్రయిస్తున్నారని, వీటిని అదుపు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఇవ్వాలని కోరారు. దీనిపై ఎంపీపీ మీసాల సత్యవతి, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణరావు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ

కార్తీక మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. శివుడికి ప్రత్యేక, రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎచ్చెర్ల: స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: ఉమాజఠలేశ్వరునికి రుద్రాక్షలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధి ఉమాజఠలేశ్వరునికి అభిషేకాలు



గార: సతివాడ శివాలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సాఫ్ట్ టెన్నిస్‌లో సిక్కోలు ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి అండర్–19 బాలబాలికల సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో జిల్లా మూడో స్థానంలో నిలిచి సత్తాచాటింది. జిల్లా బృందానికి కోచ్ మేనేజర్లుగా సుజాత, లక్ష్మణరావులు వ్యవహరించారు. వీరి రాణింపుపై డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు బీవీ రమణ, ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఆనంద్‌కిరణ్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శలు



రణస్థలం: చిల్లపేట యర్రవరంలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని చిల్లపేట యర్రవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిల్ల శంకర్ రెడ్డి కుమారుడు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో వారి కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. అలాగే రణస్థలం వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహాదాను రంగారావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, ఎంపీటీసీ బోనెల చంద్రశేఖర్, బొమ్మలాట శ్రీరాములు, మాగుపల్లి రాముడు, మింది జనార్ధన్ రెడ్డి, రెడ్డి అప్పలనాయుడు, గొర్లె శ్రీనివాసరావు, దన్నాన హరి తదితరులు ఉన్నారు.

జి.సిగడాం: జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్, దేవరవలస మాజీ సర్పంచ్ తిరుమరెడ్డి గౌరీశంకర రావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మండల వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు బత్తుల వెంకటకృష్ణ రావు, బుదారి లక్ష్మణరావు, చిత్తిరి మోహన్, తొత్తడి రామారావు, టంకాల సత్యనారాయణ కలిసి సోమవారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రణస్థలం: మండలంలోని వి.ఎన్.పురం పంచాయతీ మిందిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మింది రామప్పడు భార్యకు మోకాలి శస్త్ర చికిత్స జరిగింది. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పరామర్శించి త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. ఆయనతో పాటు రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, పతివాడ సత్యం తదితరులు ఉన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ఎస్పీ కార్యాలయం ముందు దళిత జేఏసీ నేతలు, మృతురాలి కుటుంబీకులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని చిన బజారు కూడలి వద్ద ఉన్న ఒక షాపు లిఫ్ట్‌లో ఇటీవల ప్రమాదానికి గురై మృత్యువాత పడిన దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని, నిండుప్రాణం బలిగొన్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ జేఏసీ నేతలు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జేఏసీ నేతలు కంత వేణు, శ్రీనుల ఆధ్వర్యంలో సభ్యులు, మృతురాలి కుమారుడు పవన్, కుమార్తె లహరిలతో కలిసి ఫిర్యాదు చేశారు. షాపులో తమ తల్లి చనిపోతే ప్రకాష్‌బాబు ఓల్డ్ బుక్‌షాప్ వద్ద కళ్లు తిరిగి పడిపోయిందని బాపూజీ షాపు యజమాని తప్పుగా సమాచారమిచ్చారన్నారు. అనంతరం జేఏసీ నేతలు మీడియాతో లిఫ్ట్ నిర్వహణ సక్రమంగా లేనందువలనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఎస్పీ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి పిల్లలను ఆదుకోవాలని కోరగా ఇప్పటికే రెండో పట్టణ పోలీసులకు న్యాయం చేయమని ఆదేశాలిచ్చినట్లు చెప్పారన్నారు.